## క్లుప్తంగా

### పుస్తక నిక్షిప్త కేంద్రం ప్రారంభం



పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సువ్వారి సువర్ణ

**బూర్జ:** మండలంలోని వైకుంఠపురం గ్రామంలో పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. విద్యార్థులు, యువత, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థి పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. సువ్వారి సత్యనారాయణ, గ్రంథాలయాధికారి ఎ.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### సనాతనధర్మం గొప్పది



మాట్లాడుతున్న కూర్మరామానుజదాసు

**పోలాకి:** సనాతనధర్మం గొప్పదని, ధనుర్మాస విశిష్టతపై విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని ప్రముఖ వ్రత ప్రచారకులు మొదలవలస కూర్మరామానుజదాసు స్వామి అన్నారు. ఆదివారం చింతాడపేటలోని శ్రీరామయోగి సేవాశ్రమంలో నిర్వహించిన ప్రత్యేక సత్సంగంలో పాల్గొన్నారు. ధనుర్మాసంలో పాటించాల్సిన నియమాలు, ముఖ్యంగా గోదాదేవి కల్యాణం గూర్చి వివరించారు. సనాతన ధర్మంపై యువతకు అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ట్రస్టు అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం, సింగుపురం లక్ష్మణరావు, వడిశ గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

### తడిపొడి విధానంలో వరిసాగు మేలు



క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్న ప్రాజెక్ట్ బృందం సభ్యులు

**సరుబుజ్జిలి:** తడిపొడి విధానంలో సాగుచేయడం వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని ఏడబ్ల్యూడీ ప్రాజెక్ట్ సైంటిస్ట్ (ఢిల్లీ) డాక్టర్ గౌరవ్‌కౌశిక్ తెలిపారు. మండలంలోని సింధువాడ రైతు భరోసా కేంద్రం పరిధిలోని పొలాల్లో పీఎస్‌పీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుకు ఆదివారం రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి, వ్యవసాయ అసిస్టెంట్ మనోహర్, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

### ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు



పింఛన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ లక్ష్మి

**ఎల్.ఎన్.పేట:** ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత అర్హత కలిగిన లబ్ధిదారుల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని శ్యామలాపురం పునరావాస కాలనీ సర్పంచ్ బలగ లక్ష్మి అన్నారు. కొత్తగా మంజూరైన వైఎస్సార్ భరోసా పింఛన్లను ఆదివారం పంపిణీ చేశారు. అర్హులను గుర్తించటంతోపాటు వారికి పథకాలు మంజూరు చేయించటం, ఇంటి వద్దకు తెచ్చి పథకాలను అందించే బాధ్యత కూడా గ్రామ వలంటీర్లకు సీఎం జగన్ అప్పగించారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బలగ గోవిందరావు, గ్రామ వలంటీర్లు బాణాల దాలిరాజు, సౌదర్య, ప్రసాద్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారులకు భోగిపళ్లు



చిన్నారులకు భోగిపళ్లు పోస్తున్న తల్లులు

**సారవకోట:** మండలంలోని అవలింగి గ్రామంలోని జేబీటీ పాఠశాలలో ఆదివారం గ్రామానికి చెందిన పలువురు చిన్నారులకు భోగిపళ్లు పోశారు. భోగి పండుగ నాడు పాఠశాలకు సెలవు కావడంతో ఆదివారం కార్యక్రమం నిర్వహించినట్లు డైరెక్టర్ మోహనగాంధీ తెలిపారు. మన ఆచార, సంప్రదాయాలను విద్యార్థులకు తెలియజేసేందుకు ఇంటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అభిప్రాయం వ్యక్తంచేశారు.

# సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు
- గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ తమ్మినేని సీతారాం

**బూర్జ:** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందజేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జ పంచాయతీ చిన్నకురింపేటలో ఆదివారం 90వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ విద్య, వైద్యం, సేద్యంతోపాటు పలు రంగాలను సీఎం జగన్ పరుగులు పెట్టిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా ప్రతీ పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న పాఠశాలలో రూపురేఖలు మార్చుతున్నామని తెలియజేశారు. సచివాలయాలను స్థాపించి దానికి అనుబంధంగా వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి వివక్షకు తావులేకుండా పాలన అందిస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని తెలియజేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, లేదా అని ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు అందిన సంక్షేమ పథకాల లబ్ధిని సచివాలయ సిబ్బందితో కలిసి వివరించారు. ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే గ్రామ సచివాలయాలను సంప్రదించాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్పీకర్‌ను గ్రామస్తులు కోరారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రభుత్వం రూ.2,500 నుంచి రూ. 2,750కు పెంచిన పింఛన్ లబ్ధిదారులకు అందుతుందో లేదా అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, స్థానిక సర్పంచ్ ఏగు అనురాధ, వైస్‌ఎంపీపీలు కరణం కృష్ణమూర్తినాయుడు, బుడుమూరు సూర్యారావు, డీసీఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు బగాది నారాయణమూర్తి, మాజీ ఏఎంసీ చైర్మన్ గుమ్మడి రాంబాబు, మండల ప్రధాన కార్య దర్శి ఇసాయి వెంకట్రావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

# ఈ-పాస్ పుస్తకాల్లో తప్పులు!

- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం
- భూ యజమానుల ఆందోళన



వేరొక రైతు ఫొటోతో వచ్చిన పాస్ పుస్తకం

**సరుబుజ్జిలి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్షణ పథకంలో భాగంగా భూవివాదాలకు చెక్ పెట్టేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా దశాబ్దాలుగా ఉన్న భూ వివాదాలను సరి చేయాలనే తలంపుతో భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తొలి దశలో ఎంపిక చేసిన మండలాల్లోని గ్రామాల్లో డ్రోన్‌ల సహకారంతో రీసర్వే చేపట్టింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఈ కార్యక్రమంలో కీలకమైన రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల భూ యజమానుల్లో ఆందోళన నెలకొంటుంది. మండలంలోని డకరవలస పంచాయతీ పరిధి సూర్యనారాయణపురం గ్రామంలో సువ్వారి మురళీధరరావుకు ఖాతా నంబర్ 165లో 30 సెంట్లు జిరాయితీ భూమి ఉంది. ఈ గ్రామంలో భూ సర్వే చేపట్టారు. కొత్త ఈ - పాస్ బుక్‌ను గత ఏడాది సెప్టెంబర్ 22న మంజూరు చేయగా తాజాగా రెండు రోజుల కిందట ఆయన చేతికి అందింది. అయితే ఈ - పాస్ బుక్‌ను చూసిన భూ యజమాని షాకయ్యారు. ఈ బుక్‌లో ఖాతా నంబరు, భూ విస్తీర్ణం, యజమాని చిరునామా తదితర వివరాలు సరిగానే ఉన్నా... పాస్ పుస్తకంలో యజమాని ఫొటోని వేరొకరిది ముద్రించారు. దీని సరి చేయాలని రెవెన్యూ అధికారులను కోరాడు. ఇలా పలువురి ఫొటోలు మారినట్టు సమాచారం.

**సరి చేస్తాం...**

ఈ - పాస్ బుక్‌లో భూ యజమాని ఫొటో మారిన విషయమై తహసీల్దార్ రమేష్‌బాబు వద్ద ప్రస్తావించగా.. పరిశీలిస్తామని తెలిపారు. సరిదిద్దేందుకు తక్షణ చర్యలు చేపడతామని వెల్లడించారు.

# గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఏడీఏ మధుబాబు

**పాతపట్నం:** గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని, ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని పలాస ఏడీఏ లింగాల మధుబాబు అన్నారు. పాతపట్నం నీలమణిదుర్గ ఆలయం సమీపంలోని హెలీపెడ్ గ్రౌండ్ క్రీడా మైదానంలో నీలమణిదుర్గ క్రికెట్ అసోసియేషన్ (ఎస్ఎన్‌డీ) ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ 12 రోజులపాటు నిర్వహిస్తామని, 28 జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు శ్రీరామ్ రమణారావు తెలిపారు. ఏడీఏ, ఎస్ఈబీ ఎస్ఐ దస్తగిరి బ్యాటింగ్ చేసి, యువకులను ఉత్సాహపరిచారు. ఎంపీటీసీ కొండాల యరకయ్య, సీహెచ్‌సీ డైరెక్టర్ కనకాల కర్రన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు బి.నారాయణమూర్తి, శిర్ల ప్రభాకరరావు, పోలాకి నరేష్, అదును పాడి, పి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

# వివేకానందుని రచనలు స్ఫూర్తిగా తీసుకోవాలి



వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేస్తున్న వెంకటరావు

**ఎల్.ఎన్.పేట:** స్వామి వివేకానందుని రచనలను, ఆయన నిర్దేశించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు అన్నారు. శ్రీశారదరామకృష్ణ సేవాసమితి సారధ్యంలో జాతీయ యువజన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీనివాసనగర్‌లోని ఠాగూర్ సంస్థ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, యువతను ఉద్దేశించి మాట్లాడారు. మంచి సమాజం తయారు కావాలంటే మీరే పునాదిగా నిలవాలని సూచించారు. సంస్థ సభ్యులు ఎ.శేఖర్, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండల ప్రధాన కార్యదర్శి రామశకరరావు పాల్గొన్నారు.

# 75 వేల చేప పిల్లల పంపిణీ



లాబర చేరువులో చేప పిల్లను విడిచిపెడుతున్న దృశ్యం

**పాతపట్నం:** మండలంలోని పాతపట్నం, లాబర గ్రామాలకు చెందిన గిరిజనులకు 75 వేల చేప పిల్లలను పంపిణీ చేసినట్లు మత్స్యశాఖ అధికారులు రవికుమార్, సుదర్శనరావు తెలిపారు. లాబర సమీపంలోని చేరువులో 50 వేల చేప పిల్లలను ఆదివారం విడిచిపెట్టారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అధికారి సుదర్శనరావు మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనులకు అన్ని విధాలుగా ఆదుకుంటుందని, మత్స్యశాఖ ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో ఉన్న చేరువుల్లో చేపపిల్లలను పంపిణీ చేయనుందన్నారు. పాతపట్నం గ్రామానికి 25 వేలు చేప పిల్లలు పంపిణీ చేశారు. దొర ప్రసాదరావు, మల్లిపురం గోవిందరావు, డి.భాస్కరరావు, డి.ఉషారాణి, కృష్ణారావులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శం



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రామ్‌గోపాల్, తదితరులు

**కొత్తూరు:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు మనందరికీ ఆదర్శమని సామాజిక న్యాయ పోరాట సమితి సభ్యుడు కల్లేపల్లి రామ్‌గోపాల్ అన్నారు. మండలంలోని బలద గ్రామంలో పి.ఎస్.ఎన్.మూర్తి నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. బొడ్డేపల్లి కృష్ణారావు, సారిపల్లి ప్రసాదరావు, బత్తిన మోహన్‌రావు, బీఎస్పీ నాయకులు సోమేశ్వరరావు, బుద్ధుడు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రెండు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం

**నరసన్నపేట:** మండలంలోని చేనులవలస, వీఎన్‌పురం గ్రామాల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ ఆరంగి మురళి ఆదివారం తెలిపారు. మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

### 200 మందికి వైద్య పరీక్షలు

**సరుబుజ్జిలి:** మండలంలోని పెద్దపాలెం గ్రామంలో శ్రీకాకుళం సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. 200 మందికి వైద్య పరీక్షలు చేపట్టారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యుడు శ్రీనివాసరావు తనిఖీలు చేసి మందులు పంపిణీ చేశారు. ప్రజలు అధికంగా రక్తహీనత, కాల్షియం లోపంతో బాధపడుతున్నట్లు తెలిపారు.

### ప్రజల ఆదరణ చూసి ఓర్వలేకే విమర్శలు



ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ

**మెళియాపుట్టి:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతికి మండలంలో అపూర్వ ఆదరణ దక్కుతోందని, దీన్ని చూసి టీడీపీ నేతలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మెళియాపుట్టి ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ అన్నారు. ఆదివారం ఆమె పెద్దలక్ష్మీపురం గ్రామంలో సాక్షితో మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలలో కూడిన కరపత్రాలు పంపిణీ చేస్తూ పారదర్శక పాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి గ్రామాల్లో తిరుగుతూ ప్రజలతో మమేకమైన సందర్భాలలో స్థానిక ప్రజలు ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజలు ఎక్కడున్నా.. మీతోనే ఉంటానని.. కొండలపైకి సైతం వెళ్తూ వారి సమస్యలు తెలుసుకుంటున్న తీరుతో గిరిజనులు ఎమ్మెల్యేకు మరింత దగ్గరయ్యారన్నారు. మహిళా ఎమ్మెల్యే అనిచూడకుండా విమర్శిస్తున్న ప్రతిపక్షాలకు రానున్న ఎన్నికల్లోనూ పరాభవం తప్పదన్నారు.

### షట్టర్లను బాగుచేయాలి



తురకపేట వద్ద మరమ్మతులకు గురైన షట్టర్

**సరుబుజ్జిలి:** మండలంలోని యరగాం - పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్‌పై ఏర్పాటు చేసిన షట్టర్లు పూర్తిగా పనిచేయక పోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 16 కిలో మీటర్లు మేర సుమారు 6 వేల ఎకరాల ఆయుకట్టుకు సాగునీరందించే కాలువలో షట్టర్లు పూర్తిగా పాడవ్వడంతో సాగునీటిని మళ్లించేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నామని రైతులు అంటున్నారు. తరచూ కాలువ గట్లు గండ్లు పడుతున్నాయన్నారు. అధికారులు స్పందించి షట్టర్లను మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

### గడ్డి కుప్పలు దగ్ధం



కాలిపోతున్న వరిగడ్డి కుప్పలు

**జలుమూరు:** పాగోడు పంచాయతీ వెలుసోదలో ఏడు ఎకరాలకు చెందిన వరి గడ్డి కుప్పలు ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి బడిదయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనలో గ్రామానికి చెందిన గొల్లంగి శ్రీరాములు, భూలోకడుకి చెందినవి. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో కోటబొమ్మాళి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే గడ్డి కుప్పలు కాలిపోయాయి. బాధితులను సర్పంచ్ దామ మన్మధరావు, ఎంపీటీసీ చందనబాబు పరామర్శించారు.

# 14 నుంచి కాశీవిశ్వేశ్వర ఆలయ ఉత్సవాలు



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

**జలుమూరు:** కరవంజ గ్రామంలోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ మూడో వార్షికోత్సవ ఉత్సవాలు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు జరగనున్నాయని ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఈ మేరకు వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. భోగి రోజు స్వామివారి తిరువీధి ఉత్సవం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, సంక్రాంతి రోజు బల ప్రదర్శనలు, జానపద నృత్యాలు, కనుమ రోజు వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

# మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ ఎస్ఐ దస్తగిరి

**పాతపట్నం:** నాటు సారా, గంజాయి వంటి మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని పాతపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్ఈబీ) ఎస్ఐ దస్తగిరి అన్నారు. ఆదివారం మండలంలోని బడ్డుమర్రి, బి.గోపాలపురం గ్రామాల్లో ఎస్ఈబీ ఆధ్వర్యంలో డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా చేయాలని అవగాహన కార్యక్రమం నిర్వహిచారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సారా, గంజాయికి బానిసై నిండుజీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. సారా, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు గ్రామాల్లో వినియోగించినా, రవాణా చేసినా 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

# యోగాతో మానసిక ఉల్లాసం



యోగా శిక్షణలో పాల్గొన్న స్థానికులు

**నరసన్నపేట:** యోగా సాధన నిత్యం చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చని స్థానిక వివేకానంద ధ్యాన యోగా సమితి గురువు సదాశివుని రవి అన్నారు. స్థానిక మారుతీ నగర్‌లోని ప్రైవేట్ స్కూల్ ఆవరణలో ఆదివారం యోగా క్లాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసన్నపేట మండలం, టౌన్‌లో ప్రతిచోటా యోగా క్లాసులు నిర్వహించి, ప్రజల్లో యోగాపై అవగాహన పెంచనున్నట్లు తెలిపారు. కోవిడ్ మళ్లీ వస్తుందనే నేపథ్యంలో ఈ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతీ ఆదివారం యోగా క్లాసులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు వినియోగించుకోవాలని కోరారు. యోగా ట్రైనర్ వండాన సుప్రజ ఈ శిబిరంలో క్లాసులు నిర్వహించారు.

# అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**కొత్తూరు:** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రజాసంక్షేమానికి, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మండలం వైఎస్సార్‌సీపీ నాయకులు, పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ, సారిపల్లి ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. అర్హత కలిగి దరఖాస్తు చేసుకుంటే వారి ఇంటి వద్దకే పింఛన్లు పంపిణీ చేస్తున్నారని గుర్తుచేశారు. రోజురోజుకూ జగన్‌మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ప్రజాదారణ చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు, అసత్య ఆరోపణల ప్రచారం చేస్తున్నారన్నారు. కొత్తూరు మండలంలో 279 కొత్త పింఛన్లు ఎమ్మెల్యే రెడ్డి శాంతి పంపిణీ చేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పట్టించుకోని టీడీపీ నాయకులకు ప్రజలే తగిన బుద్ధిచెబుతారన్నారు. వీరితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# గుర్రపు డెక్కతో నిండిన మినీ రిజర్వాయర్



గుర్రపుడెక్కతో నిండి ఉన్న కొత్తకోట మినీరిజర్వాయర్

**సరుబుజ్జిలి:** ఏళ్ల తరబడి కొత్తకోట మినీ రిజర్వాయర్‌లో పూడికలు తీయలేదు. దీంతో మైదానాన్ని తలపిస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో రైతులు చుక్క నీటికోసం కొట్లాడుకుంటున్నారు. రిజర్వాయర్ నిర్వహణ విషయంలో అధికారులు పూర్తిగా పట్టించుకోకపోవడం వల్ల సుమారు 50 ఎకరాల్లో గుర్రపుడెక్క విస్తరించింది. కొత్తకోట, డకరవలస, నక్కలపేట, బురిడివలస, రావివలస, చినవెంకటాపు, షళంత్రి, కొండవలస, రొట్టవలస, వీరమల్లిపేట తదితర గ్రామాల పంట పొలాలకు సాగునీరు అందించాలి. అయితే రిజర్వాయర్ నిర్వహణలో లోపాల వల్ల సాగునీటి పంపిణీలో ఆయా గ్రామాల రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

# రూ.93.94 లక్షలతో నాడు-నేడు పనులు



పిల్లర్లు నిర్మిస్తున్న దృశ్యం

**పాతపట్నం:** మండల కేంద్రంలోని ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాడు-నేడు రెండో విడతలో రూ.93.94 లక్షలతో 8 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయని మండల ఇంజినీర్ ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ ఏడాది కేజీబీవీలో ఇంటర్ కూడా నిర్వహించడంతో అదనపు తరగతి గదులను ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు చురుగ్గా సాగుతున్నాయి.

# నేడు చినజీయర్ స్వామి పర్యటన

**సారవకోట:** మండలంలోని చీడిపూడి వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నిర్వహించనున్న ధనుర్మాస ఉత్సవాలను సందర్శించేందుకు అహోబిళం చినజీయర్ స్వామి రానున్నట్లు ఆలయ అర్చకులు రామానుజాచార్యులు ఆదివారం తెలిపారు. ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. ఆధ్యాత్మిక ప్రవచనాలు చేయనున్నట్లు తెలిపారు.